

# సెక్రటరీ

**'మల్లిక్'**

విశాలాక్షికి ఉద్యోగం వచ్చింది. అదేదో కంపెనీలో సెక్రటరీ ఉద్యోగానికి దరఖాస్తు పెట్టుకుంది. వాళ్లు అందరితోబాటు ఇంటర్వ్యూకి పిలిచి, ఈమెను ఆ ఉద్యోగానికి తీసుకున్నారు.

విశాలాక్షి తనకు ఉద్యోగం వచ్చినందుకు సంతోషించిందిగానీ ఆ ఉద్యోగంలో చేరడానికి సందేహించింది. ఆమె చాల సినిమాల్లో, నవలల్లో కంపెనీ యజమానులు తమ లేడీ సెక్రటరీలను బలవంతం చెయ్యడం, వాళ్లతో అసభ్యంగా ప్రవర్తించడం తమ శరీరాలు అర్పించకపోతే వాళ్లను ఉద్యోగంలోంచి తీసేస్తామని బెదిరించడం చూసింది. అవన్నీ తలుచుకుంటుంటే ఆమెకు ఉద్యోగంలో చేరాలంటేనే భయంవేస్తుంది.

విశాలాక్షి తన మనసులోని భయాన్ని, సందేహాలను తన స్నేహితురాళ్లతో వ్యక్తపరిచింది. వాళ్లు ఆమె మాటల్ని తేలికగా కొట్టిపారేశారు. తమ ప్రవర్తనమీదనే ఎదుటివారి ప్రవర్తన ఆధారపడిఉంటుందనీ, తాము చనువు ఇవ్వందే ఎవడు మాత్రం ఏంచెయ్యగలడనీ, ఆఫీసుల్లో రవికెలు చింపేసి బలవంతాలు చెయ్యడం కేవలం సినిమాల్లో, నవలల్లో మాత్రమేగాని నిజజీవితంలో ఎక్కడా జరగదనీ ధైర్యంచెప్పి విశాలాక్షిని వెంటనే ఉద్యోగంలో చేరమని సలహా యిచ్చారు.

స్నేహితురాళ్ల సలహాప్రకారం విశాలాక్షి ఉద్యోగంలో చేరింది. రోజులు గడిచిపోతున్నాయి. విశాలాక్షి ఊహించుకుని భయపడ్డ సంఘటనలేవీ జరగలేదు. ఆమె పనిచేసే కంపెనీ యజమాని చాల మంచివాడు. మొదట్లో విశాలాక్షి అందుకు సంతోషించినా రానురాను అతని మంచితనం ఆమెకు విసుగుపుట్టించింది.

ఆ కంపెనీ యజమాని విశాలాక్షితో పనిగురించి తప్ప ఇతర విషయాలేమీ మాట్లాడేవాడుకాడు. ఆమెయందు కొంచెంకూడా ఆసక్తి చూపించేవాడుకాడు. కనీసం విశాలాక్షికి ఏదైనా లెటర్ డిక్టేట్ చెస్తున్నప్పుడైనా ఆమెవంక చూడడు. సీలింగ్ ఫాన్‌వంక చూస్తూనో, గది గోడలవంక చూస్తూనో, లేకపోతే తలవంచుకొని తన ముందున్న కాగితాలు పరిశీలిస్తూనో ఆమెకు డిక్టేషన్ ఇస్తుంటాడు.

విశాలాక్షిని కంపెనీ యజమాని ప్రవర్తన చాల కృంగదీసింది. అది తన స్త్రీత్వానికే అవమానంగా భావించింది. ఎన్నో సార్లు అద్దంలో పరిశీలనగా తనరూపం చూచుకుంది. ఆమెకు తన రూపంమీద తనకు గట్టి నమ్మకం ఉంది. అలా అద్దంలో తన రూపం చూసుకుంటున్నంతసేపూ విశాలాక్షికి తనెంతో ఎత్తులో, ఆకాశంలోని నక్షత్రాలతో సమానంగా, ఏదో పర్వతం మీద ఉన్నట్లు భావించేది. కానీ ఆఫీసులో అతనిముందు ఉన్నప్పుడుమాత్రం తను అధఃపాతాళానికి జారిపోతున్నట్లు కృంగిపోయేది. విశాలాక్షి తన అలంకరణ విషయంలో తగు శ్రద్ధ చూపించి తన యజమానిని ఆకర్షించడానికి పలువిధాలుగా ప్రయత్నించి విఫలురాలైంది. ఆమెలో అశాంతి రోజురోజుకూ పెరిగిపోసాగింది.

విశాలాక్షి వేరే కంపెనీలకు దరఖాస్తులు పెట్టడం మొదలుబెట్టింది. ఆమె స్నేహితురాళ్లు అందుకు కారణం అడిగితే ప్రస్తుతం తను ఉద్యోగంచేస్తున్న కంపెనీ యజమాని ప్రవర్తన ఏమీ బాగోలేదనీ, అతనిక్రింద పనిచెయ్యడం తనకు యిష్టంలేదనీ చెప్పింది,

ఒకానొక శుభముహూర్తాన విశాలాక్షికి వేరే కంపెనీలో సెక్రటరీ ఉద్యోగం దొరికింది. ఆమె పాతకంపెనీకి 'గుడ్‌బై' చెప్పేసి క్రొత్త కంపెనీలో చేరింది.

ఇప్పుడు విశాలాక్షికి అద్దంలో తన రూపం చూచుకుంటుంటే గర్వంకలుగుతుంది. ప్రస్తుతం తను పనిచేస్తున్న కంపెనీ యజమాని విశాలాక్షికి నచ్చాడు, అతను అంత రూపసికాడు. "అయితేనేం?...మనిషి ఎంతో 'సరదా'గా ఉంటాడు..." అనుకుంది విశాలాక్షి.

---